## తవ్విన ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణం


డీమార్ట్ రోడ్డులో వేసిన సీసీ రోడ్డు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ నెక్సస్ మాల్ చౌరస్తా నుంచి డీమార్ట్ వరకు తవ్విన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మూసాపేట సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రారంభించారు. ఈ నెల 12న ఇష్టారాజ్యంగా తవ్వకాలు..! అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆంధ్రజ్యోతి కథనానికి అధికారులు స్పందించారు. బీజీఎల్ కాంట్రాక్టర్‌తో మంగళవారం తవ్విన రోడ్డులో నిర్మాణ పనులను ప్రారంభించారు. భాగ్యనగర్ గ్యాస్ పనులకు లైన్ క్లియర్ అయింది. పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత ఏజెన్సీ కాంట్రాక్టర్‌ను అధికారులు ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

## భరత్‌నగర్ మార్కెట్‌లో చెత్త తొలగింపు

ఫతేనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్‌లో కొన్ని రోజులుగా పేరుకుపోయిన చెత్తను మంగళవారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించారు. గుట్టలుగా పేరుకుపోయిన చెత్త కుప్పలు అనే శీర్షికతో మంగళవారం ప్రచురించిన కథనానికి ఫతేనగర్ కార్పొరేటర్ సతీశ్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది స్పందించారు. భరత్‌నగర్ మార్కెట్‌లోని చెత్తను ఆటోలలో తరలించారు. చెత్త తొలగింపుపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.


భరత్‌నగర్ మార్కెట్‌లో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

# డంపింగ్ కేంద్రాలుగా రహదారులు

- భవన నిర్మాణ వ్యర్థాలకు అడ్డాగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


నర్సాపూర్ చౌరస్తా నుంచి భరత్‌నగర్ వెళ్లే దారిలో భవన నిర్మాణ వ్యర్థాలు

బాలానగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లోని పలు ప్రధాన రహదారులు భవన నిర్మాణాల వ్యర్థాలకు అడ్డాగా మారాయి. క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు గుట్టు చప్పుడు కాకుండా రాత్రి సమయాల్లో డెబ్రీస్(నిర్మాణ) వ్యర్థాలను రోడ్ల పక్కన, ప్రభుత్వ స్థలాల్లో వేస్తున్నారు. బాలానగర్, నర్సాపూర్ చౌరస్తా నుంచి వెళ్లే దారిలో దీన్‌దయాల్ నాలాకు సమీపంలో, సనత్‌నగర్ వెళ్లే దారిలో ఐలా కార్యాలయం పక్కన, ఐడీపీఎల్ కంపెనీ ప్రధాన రహదారి, బాలానగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమీపంలో భవన నిర్మాణ వ్యర్థాలు కుప్పలుగా పడిఉన్నాయి. ఈ వ్యర్థాలను తరలించేందుకు అయ్యే ఖర్చును తగ్గించుకునేందుకు నిర్మాణదారులు గుట్టు చప్పుడు కాకుండా రోడ్ల పక్కన వదిలి వెళుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వ్యర్థాలను డంప్ చేయకుండా నిఘా ఏర్పాటు చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


భరత్‌నగర్ వెళ్లే దారిలో ఐలా కార్యాలయం సమీపంలో ఉన్న మట్టి, భవన నిర్మాణ వ్యర్థాలు

# చెరువులను అభివృద్ధి చేయండి

- ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్
- హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం అందజేత


చెరువుల అభివృద్ధిపై హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను అభివృద్ధి చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ కోరారు. ఈ మేరకు వారు మంగళవారం బుద్ధభవన్‌లో హైడ్రా కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో కొన్ని చెరువులు, కుంటలను అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. కొందరు కోర్టులను ఆశ్రయించడంతో చెరువు అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయని, వాటి వివరాలు సేకరించి వెంటనే పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్‌ను కోరారు. భూ యజమానులు, కొనుగోలుదారులు ఎవరైనా సరే వారికి టీడీఆర్ వచ్చాకే పనులు ప్రారంభించుకోవాలన్నారు. నల్ల చెరువు, ఐడీఎల్ చెరువు అభివృద్ధి చేసే సమయంలో నాలా డైవర్షన్ చేయాలని, వర్షాకాలం లోగా చెరువు, కుంటల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వారు కోరారు. సానుకూలంగా స్పందించిన హైడ్రా కమిషనర్ కూకట్‌పల్లిలోని 9 చెరువులు, 2 కుంటలను సుందరీకరణకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. త్వరలోనే భూ యజమానులతో సమావేశం నిర్వహిస్తానని ఎమ్మెల్యేకు రంగనాథ్ హామీ ఇచ్చారు.

# అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, వివేకానందనగర్, కూకట్‌పల్లి(పార్టు) పరిధిలో నెలకొన్న సమస్యలపై చర్చించేందుకు వివేకానందనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలో తవ్విన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని, పనులు జరిగే సమయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగేనీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్లు ప్రియాంక, ఝాన్సీ, ఇంజనీరింగ్ విభాగం ఏఈలు రాజీవ్, నిఖిల్, శ్రావణి, సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


విజేతకు బహుమతి అందజేస్తున్న మాల్ ఎండీ జైదీప్‌రెడ్డి

## ఆకట్టుకున్న సిబ్లింగ్ ఫ్యాషన్ వాక్


ఫ్యాషన్ షోలో పాల్గొన్న కిడ్స్

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి అశోకావన్ మాల్‌లో నిర్వహించిన సిబ్లింగ్ (తోబుట్టువులు) కిడ్స్ ఫ్యాషన్ వాక్ ఆకట్టుకుంది. రిలయన్స్ ట్రెండ్స్, మేక్ మై హోం, డెకథ్లాన్ సహకారంతో అశోకావన్ మాల్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సిబ్లింగ్ ఫ్యాషన్ వాక్ నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నారులు చేసిన వాక్ అక్కడున్న వారిని ఆకట్టుకుంది. మొదటి విజేతకు రూ.10 వేలు, రెండో విజేతకు రూ.8 వేలు, మూడో విజేతకు రూ.6వేలు అందించినట్టు మాల్ ఎండీ జైదీప్‌రెడ్డి తెలిపారు.


సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

## యువతకు యుద్ధ కళలు అవసరం

- కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

ఫతేనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): యువతకు దేహ దారుఢ్యంతో పాటు మానసిక బలం చేకూరేందుకు యుద్ధ కళలు దోహదం చేస్తాయని కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. ఫతేనగర్ డివిజన్ భగత్‌సింగ్ పార్కులో మార్షల్ ఆర్ట్స్ కోచ్ దుర్గారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును మంగళవారం కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. భగత్‌సింగ్ పార్కులో మార్షల్ ఆర్ట్స్ సమ్మర్ క్యాంప్ ప్రారంభమైనదని, రోజూ ఉదయం 6 గంటలకు కోచ్ దుర్గారావు నేతృత్వంలో శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో ఆనంద్, భిక్షపతి, బాగయ్య, సురేందర్, ప్రవీణ్, శేఖర్ పాల్గొన్నారు.


సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శిరీష

## బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- కార్పొరేటర్ శిరీష బాబూరావు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కార్పొరేటర్ శిరీష బాబూరావు కోరారు. ఈ మేరకు పార్టీ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ నివాసంలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను మంగళవారం కార్పొరేటర్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి కోసం, పేదల సంక్షేమం కోసం కృషి చేసిన ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అని కొనియాడారు. వరంగల్‌కు భారీ సంఖ్యలో తరలివెళ్లి సభను విజయవంతం చేద్దామని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌చౌదరి, అనిత శ్రీపాద, అరుణశెట్టి, పవన్‌కుమార్, పాతూరి గోపి, రావెల్‌షా, జాన్ మోజెశ్, భాస్కర్‌రావు, జశ్వంత్, హరినాథ్, శ్రీనివాస్, ఖదీర్, జయరాజ్, యాదుల్, ప్రకాశ్, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.


లో ప్రెషర్ సమస్య ఉన్న ప్రాంతంలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

## లో ప్రెషర్ సమస్యను పరిష్కరించండి

- జలమండలి అధికారులను కోరిన కార్పొరేటర్

బాలానగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్‌లో పైపుల నుంచి వచ్చే తాగునీటి ప్రెషర్ తగ్గిందని, వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి జలమండలి అధికారులను కోరారు. డివిజన్‌లోని వినాయక నగర్ రోడ్ నెంబర్ 16, 17లో మంగళవారం లైన్‌మెన్ ఆనంద్‌తో కలిసి ఆయన పర్యటించారు. తాగునీటి సరఫరాలో ప్రెషర్ తగ్గడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. కాలనీలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట వినాయకనగర్ కాలనీ అధ్యక్షుడు సిద్ధి రాములుగుప్త, శ్రవణ్, అమర్‌నాథ్, ఈశ్వరయ్య, నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


వివేకానందనగర్ కాలనీలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం

## రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

- కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ సబీహాబేగం అధికారులను ఆదేశించారు. వివేకానందనగర్‌లోని రోడ్ నంబర్ 8, 9, 10 లలో రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక చొరవతో రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో లింగాల ఐలయ్య, వీరారెడ్డి, నాగుల సత్యం, బొల్లు శ్రీనివాసరావు, జ్ఞానేశ్వర్, జగన్నాథం, రవీందర్‌రెడ్డి, కమ్మరి శ్రీనివాస్, వీరాంజనేయులు, శేషారావు పాల్గొన్నారు.


పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## ఘనంగా ధరిత్రి దినోత్సవం

గచ్చిబౌలి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ, బొటానికల్ గార్డెన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బొటానికల్ గార్డెన్ ప్రకృతి ప్రేమికులతో కళకళలాడింది. ఈ సందర్భంగా స్విచ్ ఎకో సంస్థ ప్రతినిధి అక్షయ్‌దేశ్‌పాండే మాట్లాడుతూ.. ప్రతి ఒక్క పక్షి మనకు లభించిన జీవ వైవిధ్యానికి గుర్తు అన్నారు. టీజీఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.రంజిత్‌నాయక్ మాట్లాడుతూ.. ధరిత్రి దినోత్సవాన్ని సంవత్సరంలో ఓ రోజు జరుపుకోవడమే కాకుండా ప్రతి రోజూ మనం భూమిని కాపాడేందుకు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ వి.తనూజ, ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాస్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ కె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్ టీ జంక్షన్ వద్ద జీబ్రాలైన్ గురించి చర్చిస్తున్న ఏఈ రాధాకృష్ణ, ట్రాఫిక్ సీఐ సురేశ్‌కుమార్

## అక్రమ పార్కింగ్‌పై ట్రాఫిక్ పోలీసుల నజర్

బాలానగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అక్రమ పార్కింగ్‌పై బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. బాలానగర్, ఫతేనగర్ రోడ్లను మంగళవారం డివిజన్ ఏఈ రాధాకృష్ణతో కలిసి బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేశ్ పరిశీలించారు. ఫతేనగర్ టీ జంక్షన్ నుంచి బాలానగర్, నర్సాపూర్ చౌరస్తా వరకు రోడ్లకు ఇరువైపులా ఉన్న అక్రమ పార్కింగ్, రోడ్డు దాటేందుకు వీలుగా జీబ్రాలైన్స్ ఏర్పాట్లపై వివరాలను సేకరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ సురేశ్ వాహనదారులకు సూచించారు.

## ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం

- కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్‌లో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్ పనులను మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రజలకు అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేష్‌గౌడ్, అంజయ్యయాదవ్, యాదగిరి, అగ్రవాసు, శామ్యూల్, రవీందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


వరంగల్ సభాస్థలి వద్ద బాలానగర్ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

## వరంగల్ సభ ప్రాంగణాన్ని సందర్శించిన కార్పొరేటర్

బాలానగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభ ప్రాంగణాన్ని బీఆర్‌ఎస్ నేతలు మంగళవారం సందర్శించారు. కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు సభాస్థలికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు బాలానగర్ ప్రజలు భారీగా తరలిరావాలని కార్పొరేటర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మందడి సుధాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## భార్య, అత్తపై కత్తితో దాడి

మియాపూర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య గొడవ నేపథ్యంలో భార్యతో పాటు అత్తపై అల్లుడు దాడి చేసిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనప్రియనగర్‌లో నివసించే మహేష్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, అతడి భార్య సత్య ఇంటివద్దనే ఉంటుంది. మహేష్ ఇటీవల చెడు వ్యసనాలకు అలవాటుపడి ఇంటి ఖర్చులకు డబ్బులు ఇవ్వకపోవడంతో భార్య ప్రశ్నిస్తుంది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం భార్యను మహేష్ కొట్టడంతో ఆమె చందానగర్‌లో ఉండే తల్లికి ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో తల్లి వచ్చి అల్లుడిని ప్రశ్నించడంతో వీరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మహేష్ భార్య, అత్తపై కూరగాయాలు కోసే కత్తితో దాడి చేసి పరారయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయాలపాలైన సత్య, ఆమె తల్లిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సీఎంఆర్‌ఎఫ్ అందజేత


కొండాపూర్‌కు చెందిన తెలుగుపాటి లక్ష్మికి మంజూరైన రూ.1.75 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

- హైదర్‌నగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి)

# గవర్నమెంట్ చదువులు.. గర్వించదగిన ఫలితాలు

- మెరిసిన పేదింటి పిల్లలు
- ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ కాలేజీ విద్యార్థులు


అమృతకుమారి, ఎంపీసీ, సెకండ్ ఇయర్


జ్యోతిలక్ష్మి, ఎంపీసీ ఫస్ట్ ఇయర్


మౌనిక, ఎంపీసీ ఫస్ట్ ఇయర్


భువన శ్రీమణి, సీఈసీ, సెకండ్ ఇయర్


మంగల్ బాయి, సెకండ్ ఇయర్


నౌస్రీన్, పీఎస్‌టీటీ సెకండ్ ఇయర్


మానస, ఎంఈసీ (496/500)

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో పేదింటి విద్యార్థులు విజయభేరి మోగించారు. చదువుకు పేదరికం ఏ మాత్రం అడ్డుకాదని కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిరూపించారు. అరకొర సౌకర్యాలు, ప్రతికూల పరిస్థితుల నడుమ మెరుగైన ఫలితాలను సాధించి ప్రభుత్వ విద్యారంగంపై ఉన్న అపోహలను తుడిచిపెట్టారు. ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తూ.. అమ్మానాన్నల కష్టాన్ని గుర్తుంచుకుని మంచి ఫలితాలు సాధించారు.

### మెరిసిన విద్యార్థులు

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలకు దీటుగా కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ సంవత్సరం అమ్మాయిలే టాపర్లుగా నిలిచారు. మొదటి సంవత్సరం కంటే రెండో సంవత్సరం విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదు చేశారు. మొదటి సంవత్సరంలో 587 మందికి 325 మంది (55.36శాతం) ఉత్తీర్ణత సాధించగా.. ద్వితీయ సంవత్సరంలో 449 మందికి 324 మంది(64.92 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇక కేటగిరీల వారిగా చూసుకుంటే.. మొదటి సంవత్సరం జనరల్ కేటగిరీలో 449 మందిలో 220 మంది (49శాతం), ఒకేషనల్ విభాగంలో 138 మందికి గాను 105 మంది (76శాతం), ద్వితీయ సంవత్సరం జనరల్ కేటగిరీలో 369 మందికి గాను 211 మంది (57.18 శాతం), ఒకేషనల్ విభాగంలో 130 మందికి 113 మంది (87శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బైపీసీ విభాగంలో ప్రియాంక గుప్తా 1000 మార్కులకు 990 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో జ్యోతిలక్ష్మి 470కి 466 మార్కులు, మౌనిక 470కి 452 మార్కులు సాధించారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్ మల్లికార్జున కాలనీకి చెందిన సాయన్నగారి మానస ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంఈసీ గ్రూపులో ప్రతిభ చాటింది. 500 మార్కులకు గాను 496 మార్కులు సాధించి సత్తా చాటింది.



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

## కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి

● కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

హైదర్‌నగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ ఫేజ్-1 కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కాలనీ వాసుల, అధికారులతో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. భాగ్యనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫీస్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ.. భాగ్యనగర్ కాలనీ సమస్యలపై స్థానికులతో చర్చించామని, త్వరలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ సూపర్‌వైజర్ నరేంద్ర, జీహెచ్‌ఎంసీ ఎస్‌ఆర్‌పీ సత్యనారాయణ, హార్టికల్చర్ అధికారి దాసు, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఫంక్షన్‌హాల్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

## ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం

● కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్‌లో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్ పనులను మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రజలకు అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేష్‌గౌడ్, అంజయ్యయాదవ్, యాదగిరి, అగ్రవాసు, శామ్యూల్, రవీందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో తిరునక్షత్ర పూజలు

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): చైత్రమాసం, శ్రీనివాసుని తిరునక్షత్రం సందర్భంగా మంగళవారం బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యపూజలతో పాటు విశేష అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని గర్భాలయంలో సంప్రోక్షణ, స్వామివారి మూల విరాట్‌కు విశేష ఫలపంచామృతాభిషేకం, పుష్పార్చన, సహస్రనామార్చనలు వైభవంగా జరిగాయి. స్వామివారి మహామండపంలో సుగంధ పుష్పాలతో అలంకరించిన పీఠంపై ఉత్సవ మూర్తులను అలంకరించి శ్రీనివాసుని కల్యాణం జరిపించారు. దేవాలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

# సీజ్ చేసిన భవనాలే వ్యాపార కేంద్రాలు

● నాలుగు నెలల క్రితం అక్రమ నిర్మాణాలంటూ 30 భవనాలను సీజ్ చేసిన అధికారులు
● ఆ తర్వాత పది రోజులకే తిరిగి నిర్మాణ పనులు ప్రారంభం
● పట్టించుకోని అధికారులు
● నిర్మాణాలు పూర్తి చేసి అద్దెకిచ్చిన యజమానులు



అధికారులు సీజ్ చేసిన నిర్మాణంలో ఉన్న భవనం (ఫైల్)



నిర్మాణం పూర్తిచేసి హాస్టల్‌కు అద్దెకిచ్చిన సీజ్ చేసిన భవనం



ఓ భవనాన్ని సీజ్ చేస్తున్న అధికారులు(ఫైల్)

గచ్చిబౌలి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ కొండాపూర్ డివిజన్ పరిధిలోని సిద్దిక్‌నగర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న సుమారు 30 భవనాలను గతంలో అధికారులు సీజ్ చేశారు. జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నాలుగు నెలల క్రితం భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారంటూ హడావిడి చేసి భవనాలను సీజ్ చేశారు. అయితే పది రోజులు కూడా గడవక ముందే నిర్మాణదారులు అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి యథావిధిగా పనులు చేసుకోవడంతో పాటు గృహప్రవేశాలు సైతం పూర్తిచేసి హాస్టళ్ల నిర్వాహకులకు అద్దెకు ఇస్తున్నారు. ఈ వ్యవహారంలో అధికారులు, కిందిస్థాయి సిబ్బంది నిర్మాణదారులతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీజ్ చేసిన భవనాల్లో పనులు జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ఇరుకు సందుల్లో భారీ భవనాలు

సిద్దిక్‌నగర్‌లో ఓ నిర్మాణదారుడు భవన నిర్మాణం కోసం 60గజాల్లో సెల్లార్ తీయడంతో పక్కనే ఉన్న ఐదంతస్తుల భవనం పక్కకు ఒరిగింది. గత ఏడాది నవంబర్ 19న ఈ ఘటన జరిగింది. దీంతో ఆ భవనంలో ఉన్నవారిని, పరిసర భవనాల్లో ఉన్నవారిని అధికారులు ఖాళీ చేయించారు. భారీ యంత్రాలతో ఒరిగిన భవనాన్ని నేలమట్టం చేశారు. కూల్చివేతలు జరుగుతున్న సమయంలో ఆ ప్రాంతానికి కనీసం ఫైర్ ఇంజన్ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అలాంటి ప్రాంతాల్లో ఇరుకైన సందుల మధ్య 6,7,8 అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. సిద్దిక్‌నగర్‌పై అధికారులు దృష్టి సారించి ఆ సమయంలో సుమారు 30 భవనాలను సీజ్ చేసి బ్యానర్లు కట్టారు. అప్పట్లో ఈ విషయం శేరిలింగంపల్లిలో సంచలనంగా మారింది. అయితే నాలుగు నెలల క్రితం అధికారులు హడావిడి చేసి సీజ్ చేసిన భవనాలు నేడు నిర్మాణాలు పూర్తిచేసుకున్నాయి. కొన్ని నివాస భవనాలుగా మారగా, మరికొన్ని వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయి. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కిందిస్థాయి అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కు కావడంతో ఇలాంటి పరిస్థితి ఉందని స్థానికులు మండిపడుతున్నారు. ఈ విషయంపై టౌన్‌ప్లానింగ్ అధికారి వెంకటరమణను వివరణ కోరగా దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### విద్యుత్, నీటి వసతి ఎలా కల్పించారు?

అక్రమ నిర్మాణాలంటూ జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ భవనాలను సీజ్ చేశారు. అయితే ఇతర విభాగాలకు చెందిన అధికారులు సీజ్ చేసిన భవనాలకు మౌలిక వసతులు ఎలా కల్పిస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సీజ్ చేసిన భవనాలకు విద్యుత్ మీటర్లు, వాటర్ కనెక్షన్లు ఎలా ఇచ్చారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల పనితీరుకు నిదర్శనం

సిద్దిక్‌నగర్‌లో జరిగే సంఘటనలు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. అక్రమ నిర్మాణాలంటూ సీజ్ చేస్తారు. పది రోజుల్లోనే తిరిగి పనులు జరుగుతుంటే ఎవరూ పట్టించుకోరు. నాలుగు నెలల్లో పనులు పూర్తిచేసి గృహప్రవేశాలు చేయడం, అద్దెలకు ఇవ్వడం చకచకగా జరిగిపోయాయి. నిర్మాణదారులకు సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- ఎల్లేష్, స్థానికుడు

## అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

హైదర్‌నగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, వివేకానందనగర్, కూకట్‌పల్లి(పార్టు) పరిధిలో నెలకొన్న సమస్యలపె చర్చించేందుకు వివేకానందనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలో తవ్విన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని, పనులు జరిగే సమయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగేనీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్లు ప్రియాంక, ఝాన్సీ, ఇంజనీరింగ్ విభాగం ఏఈలు రాజీవ్, నిఖిల్, శ్రావణి, సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## ఘనంగా ధరిత్రి దినోత్సవం

గచ్చిబౌలి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ, బొటానికల్ గార్డెన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బొటానికల్ గార్డెన్ ప్రకృతి ప్రేమికులతో కళకళలాడింది. ఈ సందర్భంగా స్విచ్ ఎకో సంస్థ ప్రతినిధి అక్షయ్‌దేశ్‌పాండే మాట్లాడుతూ.. ప్రతి ఒక్క పక్షి మనకు లభించిన జీవ వైవిద్యానికి గుర్తు అన్నారు. టీజీఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.రంజిత్‌నాయక్ మాట్లాడుతూ.. ధరిత్రి దినోత్సవాన్ని సంవత్సరంలో ఓ రోజు జరుపుకోవడమే కాకుండా ప్రతి రోజూ మనం భూమిని కాపాడేందుకు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ వి.తనూజ, ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాస్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ కె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎన్‌జీ వాహనాలతో తక్కువ కాలుష్యం

● 35 ఔరా సీఎన్‌జీ వాహనాల డెలివరీ

పంజాగుట్ట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సీఎన్‌జీ వాహనాలు ఇంధన పొదుపుతో పాటు తక్కువ కాలుష్యాన్ని వెదజల్లుతాయని హ్యూండాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ దక్షిణ భారత జోనల్ బిజినెస్ హెడ్ కృపాశంకర్ మిశ్రా అన్నారు. జూబ్లీహిల్స్‌లోని జేఎస్‌పీ హ్యూండాయ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సౌత్ జోనల్ కో-ఆర్డినేటర్ యంగ్హాన్ యూన్, రీజనల్ సేల్స్ హెడ్ జి.రామ్‌కుమార్, జేఎస్‌పీ హ్యూండాయ్ మేనేజింగ్ డైరెక్టర్ పృధ్వీరెడ్డి సమక్షంలో సూర్య ట్రావెల్స్ ఎండీ శ్రీనివాస్‌మూర్తికి 35 హ్యూండాయ్ ఔరా సీఎన్‌జీ వాహనాల పత్రాలు, తాళాలు అందజేశారు. పర్యావరణ హిత భవిత దిశగా జేఎస్‌పీ హ్యూండాయ్, సూర్య ట్రావెల్స్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో భాగస్వామ్యాన్ని ఏర్పర్చుకుందని పృధ్వీరెడ్డి తెలిపారు. స్థిరమైన రవాణా భవిష్యత్తుకు మార్గం అని, కార్పొరేట్ లాజిస్టిక్స్ రంగాలకు సీఎన్‌జీ వాహనాలు అందించడం ద్వారా తక్కువ వ్యయంతో పర్యావరణ హిత పరిష్కారాన్ని అందిస్తున్నామని అన్నారు. త్వరలోనే దక్షిణాదిలో సుమారు 200 వందల సీఎన్‌జీ ఔరా వాహనాలను డెలివరీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. సూర్య ట్రావెల్స్ ఎండీ శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ సీఎన్‌జీ వాహనాలు కాలుష్యం తగ్గించడంలోనూ, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని నిర్మించడంలోనూ సహకరిస్తాయని తెలిపారు.



సూర్య ట్రావెల్స్ ఎండీ శ్రీనివాస్‌మూర్తికి సీఎన్‌జీ ఆధారిత హ్యూండాయ్ ఔరా వాహనాలను అందజేస్తున్న దక్షిణ భారత జోనల్ బిజినెస్ హెడ్ కృపాశంకర్ మిశ్రా, జేఎస్‌పీ హ్యూండాయ్ మేనేజింగ్ డైరెక్టర్ పృధ్వీరెడ్డి

### సీఎంఆర్‌ఎఫ్ అందజేత



కొండాపూర్‌కు చెందిన తెలుగుపాటి లక్ష్మికి మంజూరైన రూ.1.75 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

- హైదర్‌నగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి)

# బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

● పటాన్‌చెరు పార్టీ కో-ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పాలనలో తెలంగాణ ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోయారని, రాష్ట్రాభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని పటాన్‌చెరు నియోజకవర్గ పార్టీ కో-ఆర్డినేటర్ వి.ఆదర్శ్‌రెడ్డి అన్నారు. ఈ నెల 27న జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశాన్ని నియోజకవర్గ ప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ఆయన నిర్వహించారు. పార్టీ స్థాపించి 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భారీ స్థాయిలో సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతూ రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్న ప్రభుత్వానికి ఈ సభ ద్వారా గుణపాఠం చెబుతామన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం బీఆర్‌ఎస్‌కు కంచుకోటని, మూడుసార్లు పార్టీని గెలిపించిన ఘనత ఇక్కడి కార్యకర్తలు, ప్రజలకు ఉందన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సభలో దిశానిర్దేశం చేస్తారన్నారు. ఈ సందర్భంగా సభ గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు జిన్నారం వెంకటేష్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదర్శ్‌రెడ్డి తదితరులు

## అక్రమ పార్కింగ్‌లపై ట్రాఫిక్ పోలీసుల నజర్

బాలానగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అక్రమ పార్కింగ్‌పై బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. బాలానగర్, ఫతేనగర్ రోడ్లను మంగళవారం డివిజన్ ఏఈ రాధకృష్ణతో కలిసి బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేశ్ పరిశీలించారు. ఫతేనగర్ టీ జంక్షన్ నుంచి బాలానగర్, నర్సాపూర్ చౌరస్తా వరకు రోడ్లకు ఇరువైపులా ఉన్న అక్రమ పార్కింగ్, రోడ్డు దాటేందుకు వీలుగా జీబ్రాలైన్స్ ఏర్పాట్లపై వివరాలను వారు సేకరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ సురేశ్ వాహనదారులకు సూచించారు.

## ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



సాత్విక్‌గౌడ్, బైపీసీ (992/1000)



అశోక్, బైపీసీ (990/1000)



వివేక్, ఎంపీసీ (987/1000)



గాలిబ్, ఎంపీసీ (985/1000)



రాజశేఖర్, (985/1000)



అక్షయ్ ఫస్ట్ ఎంపీసీ (467/470)



అదీప్, ఫస్ట్ ఎంపీసీ (466/470)

రాయదుర్గం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల విద్యార్థినులు విజయకేతనం ఎగురవేశారు. ఇంటర్ బైపీసీ ఫస్టియర్‌లో జె.లక్ష్మి ప్రణతి(438/440), పి.భవ్యశ్రీ (438/ 440), జి.శ్రీజ(437/440), ఎంపీసీలో శ్రద్ధ ఆర్య (467/470), హాసిని (466/470), ఎంఈసీలో జె.అపర్ణ (492/500), డి.పవిత్ర (491/500) మార్కులు సాధించారు.

● ద్వితీయ సంవత్సరం విద్యార్థుల్లో ఆసిఫా (991/1000), భవ్యశ్రీ (988/1000) అత్యధిక మార్కులు సాధించారు. వి.స్వాతి (985/1000), కె.సాత్విక 984/1000 సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కల్పన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ఆమె అభినందించారు.

● బాలుర గురుకుల కళాశాలలో 425 మంది పరీక్షలు రాయగా 416 మంది ఏ గ్రేడ్‌లో ఉతీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ వెంకట చలపతి తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో సాత్విక్ గౌడ్ 992, మూర్తి 991, అశోక్ 990, వివేక్ 987, గాలిబ్ 985, రాజశేఖర్ 985 మార్కులు సాధించారు. అదే విధంగా జూనియర్ ఇంటర్‌లో శ్రీకర్ 467, అక్షయ్ 467, అదీప్ 466, శ్రీహరి 437, ప్రణీత్ 436, శ్రీకాంత్ 436 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటచలపతి, వైస్ ప్రిన్సిపాల్ గణేష్, కార్యదర్శి వర్షిణి విద్యార్థులను అభినందించారు.

### ప్రభుత్వ జూనియర్ కాలేజీలో..

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. మొదటి సంవత్సరంలో 431 మంది పరీక్షకు హాజరు కాగా 325 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 499 మంది విద్యార్థులకు గాను 323 మంది పాసయ్యారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ధనీష్ (468 మార్కులు), విజయ్‌కుమార్ (409 మార్కులు) రాపాక సోను ప్రకాష్ (402 మార్కులు), ద్వితీయ సంవత్సరంలో తనుకుమారి (898 మార్కులు), సానియా ఫాతిమా (842 మార్కులు), ప్రేమ్‌సాగర్ (877 మార్కులు) సాధించారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కాలేజీ ప్రిన్సిపాల్ రవీందర్, ఉపాధ్యాయులు అభినందించారు.



విజయ్‌కుమార్ (ఫస్ట్ ఇయర్)



సోనూప్రకాష్ (ఫస్ట్ ఇయర్)



తనుకుమారి (సెకండ్ ఇయర్)



సానియా ఫాతిమా (సెకండ్ ఇయర్)



ప్రేమ్ సాగర్ (సెకండ్ ఇయర్)



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

## ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి సాయి ఐశ్వర్య కాలనీలోని సాయిబాబా ఆలయ 9వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## భార్య, అత్తపై కత్తితో దాడి

మియాపూర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య గొడవ నేపథ్యంలో భార్యతో పాటు అత్తపై అల్లుడు దాడి చేసిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనప్రియనగర్‌లో నివసించే మహేష్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, అతడి భార్య సత్య ఇంటివద్దనే ఉంటుంది. మహేష్ ఇటీవల చెబు వ్యసనాలకు అలవాటుపడి ఇంటి ఖర్చులకు డబ్బులు ఇవ్వకపోవడంతో భార్య ప్రశ్నిస్తుంది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం భార్యను మహేష్ కొట్టడంతో ఆమె చందానగర్‌లో ఉండే తల్లికి ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో తల్లి వచ్చి అల్లుడిని ప్రశ్నించడంతో వీరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మహేష్ భార్య, అత్తపై కూరగాయాలు కోసే కత్తితో దాడి చేసి పరారయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయాలపాలైన సత్య, ఆమె తల్లిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్ తదితరులు

## రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి: కేటీఆర్

జీడిమెట్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు అభిమానులు కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికను మంగళవారం కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, విజయ్‌శేఖర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

## రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయాలి

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్స వేడుకలను జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతీ నాయకుడు, కార్యకర్తపై ఉందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డివిజన్ కార్యకర్తలతో ఆయన సమావేశమై రజతోత్సవ వేడుకల ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని అనతి కాలంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన మహోన్నత శక్తి కేసీఆర్ అన్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన బీఆర్ఎస్ ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహిస్తున్న సభకు భారీ సంఖ్యలో హాజరై మన ఐక్యతను, క్రమశిక్షణను చాటాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

## అన్ని పీఎస్‌ల పరిధిలో చలివేంద్రాల ఏర్పాటుకు కృషి

●డీసీపీ సురేష్‌కుమార్

జీడిమెట్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ అన్నారు. గాజులరామారం చౌరస్తా ఈఎస్ఐ ఆసుపత్రి ముందు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. డీసీపీ కె.సురేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మంగళవారం ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ జి.హనుమంతురావు, జీడిమెట్లసీఐ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.



చిన్నారులకు అన్నప్రాసన చేయిస్తున్న సీడీపీఓ రేణుక

## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ దత్తాత్రేయ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రేణుక ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చిన్న పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తోందని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగ్యమ్మ, కృష్ణప్రియ, జ్యోతి, సురేఖ, సునీత, నాగరాణి, విజయలక్ష్మి, పద్మశ్రీ తదిరతులు పాల్గొన్నారు.

## చింతల్ రోడ్డులో మద్యం ప్రియుల హంగామా



కల్లు తాగి రోడ్డు పక్కన పడిపోయిన వ్యక్తి

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్ ప్రధాన రోడ్డులో మద్యం ప్రియులు హంగామా సృష్టిస్తూ రోడ్డును పోయే వాహనదారులు, పాదచారులను ఆందోళనకు గురి చేస్తున్నారు. ప్రధానంగా చింతల్ హ్యాపీ చిల్డ్రన్స్ ఆస్పత్రి సమీపంలోని కల్లు కాంపౌండ్, మద్యం దుకాణంలో ఫుల్‌గా కల్లు, మద్యం తాగుతున్న వారు రోడ్డుపైకి వచ్చి మత్తులో తూలుతూ హంగామా చేస్తున్నారు. కొందరు వింతగా ప్రవర్తిస్తూ రోడ్డుపైన, రోడ్డు పక్కన పడిపోతుండటంతో అదే సమయంలో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడిపోతున్నారు. కల్తీ కల్లు తాగడం వల్లే ఇలా రోడ్లపై పడిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

## స్టీల్ కంపెనీలో డీసీఎం వ్యాన్ దగ్ధం

జీడిమెట్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ మంటలంటుకొని డీసీఎం వాహనం దగ్ధమైంది. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ స్టీల్ కంపెనీలో ఈ ఘటన జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని శ్రీవేంకటేశ్వర కోపరేటివ్ సొసైటీలో శ్రీశ్యామ్ స్టీల్ కంపెనీలోని డీసీఎం వాహనానికి మంగళవారం సాయంత్రం మంటలంటుకున్నాయి. ఫైర్‌సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి చేశారు. అయితే, అప్పటికే డీసీఎం వాహనం పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇంటర్‌లో మెరిసిన ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు

**బహదూర్‌పల్లిలోని జూనియర్, ఒకేషనల్ కళాశాలల విద్యార్థులకు పలువురి ప్రశంసలు**

దుండిగల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేఎం పాండు మెమోరియల్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాలలోని ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో మరాఠి ధాత్రి బైపీసీలో 1000కి 966 మార్కులు, అమీనా బేగం బైపీసీలో 1000కి 918, పుష్పలత ఎంపీసీలో 1000 కి 959, జి.సాయికుమార్ ఎంపీసీలో 1000కి 935 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో బైపీసీ చదువుతున్న పి.జ్యోత్స్న 440కి 419, వి. వర్షిత ఎంపీసీలో 470కి 432 మార్కులు సాధించారు. కాగా ప్రథమ సంవత్సరం 24 శాతం, ద్వితీయ సంవత్సరంలో 47 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ నరేందర్ తెలిపారు.

**ఒకేషనల్ కళాశాలలో...**

కేఎం పాండు మెమోరియల్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలోని నాలుగు గ్రూపుల్లో చదివిన విద్యార్థులు అత్యధికంగా మార్కులు సాధించారు. వారిలో ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్‌లో ఎం.ప్రీతి 1000 కి 980 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. ఎలక్ట్రికల్ టెక్నికల్‌లో బి.శ్రావణ్ 1000కి 966 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచింది.

మొదటి సంవత్సరంలో ఎంపీహెచ్‌డబ్ల్యూలో జి.భాగ్యశ్రీ 500 కు 485, ఎంఎల్‌టీసీలో సీహెచ్ శ్రీహర్ష 500కు 473 మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. మంచి ఫలితాలు సాధించడంతో అధ్యాపకులతో పాటు విద్యార్థులను ప్రిన్సిపల్ షేక్ షైమన్ అభినందించారు.

**జూనియర్ కాలేజీ..**



మరాఠి ధాత్రి



అమీనా బేగం



సాయికుమార్



పుష్పలత



పి. జోత్స్న



వి. వర్షిత

**ఒకేషనల్ కాలేజీ..**



ఎం.ప్రీతి



సీహెచ్ శ్రీహర్ష



బి.శ్రావణ్

## మల్లంపేటలో డ్రైనేజీ సమస్యకు తాత్కాలిక పరిష్కారం

● కాలువను తవ్వి రేళ్లకుంటలోకి మురుగు నీటిని మళ్లించిన 'హైడ్రా'

దుండిగల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట గ్రామంలో ఇళ్లలోకి చేరుతున్న డ్రైనేజీ నీటి సమస్యకు అధికారులు తాత్కాలిక పరిష్కారం చూపారు. హైడ్రా, ఇరిగేషన్ అధికారులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ నాయక్‌తో కలిసి డ్రైనేజీ చేరుతున్న ప్రాంతంలో పర్యటించి స్థానికులకు డ్రైనేజీ సమస్య నుంచి ఉపశమనం కలిగించారు.



సర్వే నెంబరు 294లో నిలిచిన డ్రైనేజీ నీటిని మళ్లించడానికి తాత్కాలికంగా తవ్విన కాలువ

**ప్రైవేట్ స్థలంలోంచి రోడ్డుపైకి..**

డ్రైనేజీ చేరుతున్న స్థలం ప్రైవేట్ వ్యక్తులది. ఇప్పటికే ఆ ప్రాంతంలో మట్టినింపుకొని, నిర్మాణాలు చేపట్టేందుకు యత్నిస్తున్నారు. గతంలో కూడా రోడ్డుపై నుంచి ఆ స్థలంలోకి వర్షపు నీరు. డ్రైనేజీ నీరు వెళ్తుండేది. నెల రోజులుగా బాచుపల్లి కేఆర్‌సీ కాలనీలోని కొంత భాగం, ఆర్వీ కాలనీ, కాంత్రినగర్ కాలనీలతో పాటు మల్లంపేటలోని ప్రణీత్ అంటిలియా కాలనీల మీదుగా డ్రైనేజీ నీరు భారీగా పారుతూ మొదట కొత్త కుంటలోకి చేరుతోంది. అయితే, డ్రైనేజీ నీరు ఎక్కువగా రావడం వల్ల కొత్తకుంట నిండిపోయి దాని పక్కన ఉన్న మొండి కుంట చెరువులోకి వెళ్తోంది. మొండి కుంట చెరువు నిండిన తర్వాత నేరుగా మల్లంపేటలోని చిన్న చెరువులోకి వస్తోంది. ప్రస్తుతం డ్రైనేజీ ఎక్కువ రావడంతో చిన్న చెరువు నిండిపోవడంతో ఆ నీరంతా మల్లంపేట ప్రధాన రోడ్డుపై పారుతూ పక్కనే ఉన్న కాలనీని ముంచెత్తుతోంది. ఈ సమస్యతో నెల రోజులుగా సర్వే నంబర్ 294లో నిర్మించుకున్న పది ఇళ్లలోకి డ్రైనేజీ చేరింది. డ్రైనేజీ నీరు భారీగా రావడంతో ఇళ్లను ఖాళీ చేశారు.

**హైడ్రా, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు..**

కాగా, ఈ ప్రాంతంలోని ఇళ్లలోకి డ్రైనేజీ నీరు చేరిన విషయాన్ని బీజేపీ నాయకుడు అంజనేయులు ద్వారా కాలనీవాసులు హైడ్రా, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయా విభాగాల అధికారులు పలుమార్లు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనుకున్నారు. అయితే, నీరు నిలుస్తున్న భూమి ప్రైవేట్ వ్యక్తులది కావడంతో వీలుకాలేదు. ఇప్పుడు డ్రైనేజీ నీరు రోడ్డుపైకి చేరడంతో మరోసారి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అసలు చెరువుల నుంచి కట్టు కాలువలు ఉన్నాయా? లేవా? అనేది పరిశీలించిన హైడ్రా అధికారులు 1975 సంవత్సరం నుంచి ఒక నాలా పోతున్నదని గుర్తించారు. ఆ ప్రాంతంలో మంగళవారం ఎక్సకవేటర్‌తో కాలువ తవ్వించారు. అక్కడ నిలిచిన డ్రైనేజీ నీరు ఆ కాలువ ద్వారా మల్లంపేట గ్రామశివారులో ఉన్న రేళ్లకుంటలోకి మళ్లించారు. దీంతో డ్రైనేజీ సమస్య నుంచి తాత్కాలిక ఉపశమనం లభించింది.

### కాలువను మూసివేయాలని ధర్నా



అపార్టుమెంట్ వాసుల ధర్నాతో మల్లంపేట్ రోడ్డులో నిలిచిన వాహనాలు

మల్లంపేట్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలయ్యారంటూ అపార్టుమెంట్ వాసులు మంగళవారం సాయంత్రం రోడ్డెక్కి ధర్నాకు దిగారు. దీంతో బాచుపల్లి, మల్లంపేట్‌కు వచ్చి పోయే వాహనాలు నిలిచిపోవడంతో భారీ ఎత్తున ట్రాఫిక్ జామైంది. మున్సిపల్, హైడ్రా అధికారులు తాత్కాలికంగా తవ్విన కాలువను మూసివేయాలని నినాదాలు చేశారు. మల్లంపేట్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం మున్సిపల్, హైడ్రా అధికా రులు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అపార్టుమెంట్ వెనుక, ఇళ్ల మధ్యలో నుంచి ఉన్న ఖాళీ స్థలం ద్వారా తాత్కాలికంగా డ్రైనేజీ నీరు వెళ్లడానికి ఎక్సకవేటర్‌తో కాలువను తవ్వి డ్రైనేజీ నీటిని గ్రామశివారులోని రేళ్లకుంటలోకి మళ్లించారు. అయితే, నీరంతా సెల్లార్లలోకి కొత్త సమస్య వచ్చింది. దీంతో అపార్టుమెంట్ వాసులంతా సాయంత్రం 6 గంటల నుంచి రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టడంతో ట్రాఫిక్ స్తంభించింది. తక్షణమే తవ్విన కాలువను మూసివేయాలని, డ్రైనేజీ సమస్య పరిష్కరించకుండా కొత్త సమస్యలు తెచ్చిపెట్టారని నిరసన వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

దుండిగల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ స్థలంలో జోరుగా అక్రమ నిర్మాణాలు' అనే శీర్షికన ఈ నెల 20న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి దుండిగల్ మండల అధికారులు స్పందించారు. సర్వే నెంబర్ 120లో గాంధీ విగ్రహం ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో కబ్జాదారులు చేపట్టిన రెండు అక్రమ నిర్మాణాలను మంగళవారం తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు ఆర్ఐ అన్వేష్ ఎక్సకవేటర్‌తో కూల్చివేయించారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేంది లేదని, కబ్జాదారులపై చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఈ సందర్భంగా హెచ్చరించారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ సిబ్బంది

## రోడ్డుకు అడ్డుగా ఫెన్సింగ్..
# రాకపోకలు సాగేదెలా?

● ఏపీహెచ్‌ఏబీ కాలనీ నుంచి పట్వారీ ఎన్‌క్లేవ్‌కు వెళ్లే లింక్ రోడ్డును బంద్ చేసిన వైనం

● తెరిపించాలని స్థానికుల వినతి

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ ఏపీహెచ్‌ఏబీ కాలనీ నుంచి పట్వారీ ఎన్‌క్లేవ్‌కు వెళ్లే రోడ్డుకు అడ్డుగా ఫెన్సింగ్ వేయడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి కాలనీలోని అంతర్గత రహదారులు సమీప కాలనీలను కలుపుతూ లింకు రోడ్లు ఉండటం సహజం. అయితే ఈ రోడ్డును పూర్తిగా బంద్ చేయడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీలైతే ఇలా చేసే వెసులు బాటు ఉంటుంది. అయితే, సాధారణ కాలనీల్లో ఇలాంటి సంస్కృతికి స్థానికులు కొందరు బీజం వేస్తున్నట్లు సమాచారం. చిన్న షట్టర్ లో ఓ వ్యక్తి కార్ల మెకానిక్ దుకాణం నిర్వహిస్తున్నాడని, అంతర్గత రోడ్డును బంద్ చేయడంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సీసీ రోడ్డును అతను కార్లను నిలిపేందుకు ఉపయోగిస్తున్నాడని కాలనీవాసులు చెప్తున్నారు.



సీసీ రోడ్డును కార్ల పార్కింగ్ స్థలంగా మార్చిన మెకానిక్ షెడ్ యజమాని



రోడ్డుకు అడ్డుగా వేసిన ఫెన్సింగ్

అదే విధంగా పట్వారీ ఎన్‌క్లేవ్‌తో పాటు సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు బాలానగర్ వైపు వెళ్లేందుకు ఐడీపీఎల్‌కు తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తుంది. ఈ రోడ్డుకు అడ్డుగా ఉన్న ఫెన్సింగ్‌ను తీసివేస్తే ఏపీహెచ్‌బీ కాలనీ నుంచి ఆదర్శనగర్ మీదుగా ఐడీపీఎల్ కాలనీ గేటు సమీపంలోకి నేరుగా తక్కువ సమయంలో వెళ్లేందుకు అవకాశం ఉందంటున్నారు. రోడ్లకు అడ్డుగా ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించి రాకపోకలు సాగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

**అందుబాటులోకి తెస్తాం: డీసీ నర్సింహ**

ఈవిషయంపై కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నర్సింహను వివరణ కోరగా.. రెండు కాలనీలను కలిపేలా ఉన్న రోడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ బంద్ చేయడానికి వీల్లేదు. స్థానికులు సౌకర్యార్థం రోడ్డును అందుబాటులోకి తెస్తామన్నారు.



రాఘవులకు ఈఎస్ఐసీ కార్డును అందజేస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

## నిరుపేదల ఆరోగ్యానికి ఈఎస్ఐసీ కార్డు భరోసా

దుండిగల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆరోగ్యానికి ఈఎస్ఐసీ కార్డు భరోసా కల్పిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలోని మదర్ థెరిస్సా రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సహకారంతో రాఘవులు అనే వ్యక్తికి మంజూరైన ఈఎస్ఐసీ కార్డును కొలన్ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఈఎస్ఐసీ సభ్యులు రాజేశ్వరి, జ్యోతి చౌదరి, రాధమ్మ, కొలన్ శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ, ఈఎస్ఐసీ సేవలు మెరుగైన ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈఎస్ఐసీ కార్డు ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మదర్ థెరిస్సా రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సత్యనారాయణ, వేణుగోపాల్ చంద్రశేఖర్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీశైలంగౌడ్ తదితరులు

## కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి

●మంత్రికి ప్రగతినగర్ వాసుల వినతి

షాపూర్‌నగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రగతినగర్ అంబర్ చెరువులో కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ప్రగతినగర్ వాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వారు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రగతినగర్ ప్రజల విన్నపం మేరకు అంబర్ చెరువు కలుషితం కాకుండా నూతన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. ప్రగతినగర్ మాజీ కార్పొరేటర్ ఇంద్రాజిత్‌రెడ్డి, నిజాంపేట్ మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## ఆటిజం చిన్నారికి మానసిక వేధింపులు, భౌతికదాడి

●తల్లిదండ్రుల ఫిర్యాదుతో అశోకాచైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌పై కేసు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్ర జ్యోతి): ఆటిజం వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ఆలనా పాలనను తల్లిదండ్రుల్లా చూసు కోవాల్సిన చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ల నిర్వాహకులు హద్దులు మీరుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా సెంటర్లు ఏర్పాటు చేసి, వసూళ్లకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ పిల్లలను వేధిస్తున్నారని ఓ బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి సీఐ విజయవర్ధన్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన తల్లిదండ్రులు ఆటిజం (మెదడు అభివృద్ధి రుగ్మత)తో బాధపడుతున్న తమ కుమార్తె (బాలిక) ను మానసిక స్థితి మెరుగుపడుతోందనే ఉద్దేశం సుచిత్రాలోని అశోకా చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో చేర్పించారు. అయితే, సదరు బాలికను నిర్వాహకులు తీవ్ర మానసిక ఇబ్బందికి గురి చేస్తూ భౌతిక దారులకు పాల్పడున్నారు. తల్లిదండ్రులకు ఈ విషయం తెలియడంతో సెంటర్ ని ర్వాహకులను ప్రశ్నించగా, వారు దురుసుగా ప్రవర్తించారు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు ఈనెల 19న పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫి ర్యాదు చేశారు. ఈ మేరకు అశోకా చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వా హకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కుత్బుల్లాపూర్ వెళ్లే రోడ్డులో తవ్విన గుంత



పద్మానగర్ వెళ్లే రోడ్డులో తవ్విన గుంత

## గుంతలు తవ్వి వదిలేశారు!

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : తాగునీరు కలుషితం అవుతుందని జలమండలి అధికారులు మూడు రోజుల క్రితం జీడిమెట్ల డివిజన్‌లోని వెన్నెలగడ్డ ప్రధాన రహదారి నుంచి రింగురోడ్డుకు వెళ్లే చౌరస్తాలో గుంతలు తవ్వించారు. పైప్‌లైన్ మరమ్మతులు పూర్త య్యాక గుంతలను పూడ్చాల్సిన జలమండలి సిబ్బది అలాగే వదిలేశారు. దీంతో ఈ రహదారిలో వెళ్లే ప్రయాణికులు మూలమలుపు వద్ద ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో గుంతల వద్ద ట్రాఫిక్ నిలిచిపోయి ఎక్కువసేపు అక్కడే నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి ఈ గుంతలను పూడ్చాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.